క్లుప్తంగా

నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

కాజీపేట రూరల్: నర్సింగ్ విద్యార్థినికి కాజీపేట ఫాతిమానగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ కో ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, అతని స్నేహితులు రూ.45 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఈమేరకు సర్వ ప్రేమ వెల్ఫేర్ సొసైటీలో నర్సింగ్ విద్యార్థినికి చెక్కు అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఈడీ అంటే భయమెందుకు?

హన్మకొండ చౌరస్తా: లిక్కర్ స్కామ్‌తో సంబంధం లేనప్పుడు ఈడీ ఎదుట హాజరు కావడానికి ఎందుకు భయపడుతున్నావని ఎమ్మెల్సీ కవితను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ ప్రశ్నించారు. హనుమకొండలోని ఆమె నివాసంలో గురువారం విలేకరులతో స్వర్ణ మాట్లాడారు. నిన్నటి వరకు చేతులు చూపెట్టి న్యాయంగానే ఉన్నామని నమ్మించే ప్రయత్నం చేసి, ఇవాళ ఎందుకు దాక్కున్నట్లని అన్నారు. వేల మంది కార్యకర్తలను ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి తీసుకెళ్లాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. లిక్కర్ స్కాంలో న్యాయంగానే ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. సోనియాగాంధీ ఆరోగ్యం బాగాలేకున్నా ఈడీ ఎదుట హాజరైందని గుర్తు చేశారు. కవిత వ్యవహారం కుంభకోణంలో పూర్తిగా కూరుకుపోయినట్లు కనిపిస్తోందని దుయ్యబట్టారు. మహిళలు ఉద్యమాల్లో పాల్గొనడం కొత్తేమి కాదన్న స్వర్ణ.. కవిత వస్తేనే మహిళలు వస్తున్నారనుకోవడం పొరపాటని అన్నారు.

జాకబ్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం పరిశోధకురాలు గ్రేస్ ఎస్ జాకబ్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. టీచింగ్ ఓరల్ స్కిల్స్ ఎట్ మిడిల్ స్కూల్ లెవల్ ఇన్ ఇండియన్ స్కూల్స్ ఇన్ ఓమన్ : ఏ కేస్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి జాకబ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. ఇంగ్లిష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.దీపాజ్యోతి పర్యవేక్షణలో గ్రేస్ ఎస్ జాకబ్ తన పీహెచ్‌డీ పూర్తి చేశారు.

అక్షర ప్లానెట్ స్కూల్ సీజ్



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలో అనుమతి లేకుండా కొనసాగుతున్న అక్షర ప్లానెట్ స్కూల్‌ను అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాలను నిర్వహిస్తున్నారని పలు విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. దాంతో పాఠశాలను ఎంఈఓ రాంకిషన్‌రాజు గురువారం సందర్శించారు. అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

మాస్టర్జీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



హన్మకొండ అర్బన్: హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం మెడి అసిస్ట్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సంగంరెడ్డి అచ్యుత్‌రాజ్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పోలారాం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాహిత్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు 183 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. జెన్ ప్యాక్, హెచ్‌అండ్‌హెచ్, వేదిక్ట్ ఇండియా, కాన్‌స్ట్రిక్స్ లాంటి అనేక ప్రముఖ కంపెనీల్లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



మడికొండ: 46వ డివిజన్ రాంపూర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను కార్పొరేటర్ సరోజన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మడికొండ సబ్ స్టేషన్ ఏఈ వాలునాయక్, రాంపూర్ బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మారగోని రవిగౌడ్, దేవేందర్‌రావు, విజయ్‌రావు, శ్రీకాంత్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

హసన్‌పర్తి: పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను వాసవి క్లబ్, హసన్‌పర్తి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు కరంచంద్, క్లబ్ జోన్ చైర్మన్ అప్పని శంకర్, క్లబ్ కార్యదర్శి శ్యాంసుందర్, మాజీ అధ్యక్షులు నాగమళ్ల సుధీర్, భీష్మనాథం, గొరిశెట్టి కృష్ణమూర్తి, సంద్రు నాగేందర్ పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ ఘటనపై నిరసన



కేయూలో తరగతులు బహిష్కరిస్తున్న నాయకులు



కేయూ రెండో గేట్ వద్ద రాస్తారోకో..



నయీంనగర్: పెద్దమోరీ వద్ద..

కేయూ క్యాంపస్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో క్యాంపస్‌లో విద్యార్థులు గురువారం తరగతులు బహిష్కరించారు. యూనివర్సిటీ లైబ్రరీ నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ఇప్పటివరకు కూడా సీఎం కేసీఆర్ స్పందించలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌పై చర్య తీసుకుని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సూచించారు. ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, రాష్ట్ర వర్కింగ్ సభ్యులు అంబాల కిరణ్, బాధ్యులు చట్ల సతీష్, శివాజీ, ప్రశాంత్, వంశీ, క్రాంతి, మహేష్, సాయి, సాయివర్ధన్, ప్రణయ్, సాయికుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ రెండో గేట్ వద్ద రోడ్డుపై రాస్తారోకో

కేయూ క్యాంపస్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీల ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కమిషన్ చైర్మన్‌ను తొలగించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద రోడ్డుపై గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం మారెపెల్లి మనోజ్, పూసల రాజశేఖర్, కొమరం నరేంద్ర, భరత్, ఉమేష్, అశోక్, రంజిత్ పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి

నయీంనగర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ హనుమకొండ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నయీంనగర్‌లోని పెద్దమోరీ వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కుట్రపూరితంగా ప్రభుత్వం కనుసన్నుల్లోనే లీకేజీ వ్యవహారం జరిగిందని వాపోయారు. రాస్తారోకోతో కరీంనగర్ – హనుమకొండ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. విద్యార్థులను చెదరగొట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర రావు

ఖిలా వరంగల్: హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా భారత కార్మికవర్గంపోరాడాలని విప్లవ కార్మిక సంఘాల ఐక్యవేదిక (మజ్దూర్ అధికార్ సంఘర్ష్ అభియాన్ – మాస), ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ మండలం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు, ఢిల్లీ కార్మిక ఉద్యమ నాయకురాలు సుష్మ అధ్యక్షతన రెండో రోజు గురువారం జరిగిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజాస్వామిక వ్యవస్థలు సంక్షోభంలో నెట్టివేయబడ్డాయని వాపోయారు. మైనార్టీ, ఆదివాసీ ప్రజలపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, వాటి అనుబంధ సంస్థలు దాడులు చేస్తూ హత్యాకాండ సాగిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం తెచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్రాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ జాతీయ నేతలు పాల్‌సింగ్, విదూష సంతోష్, సతీష్, విక్రమ్, ఆరెల్లి కృష్ణ, బాలరాజు, బన్న నర్సింగం, జెన్నారం రాజేందర్ పాల్గొన్నారు.

కొత్తపేటలో వ్యవసాయ విద్యార్థుల పర్యటన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

వరంగల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనల్ ఇయర్ విద్యార్థినులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా 3వ డివిజన్ కొత్తపేట గ్రామంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమం(పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్)లో భాగంగా ఫైనలియర్ విద్యార్థినులు కె.రాధిక, వి.శ్రీలేఖ, సిహెచ్.శ్రీకన్య, సునంద, ఎస్.సరిత.. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సును నిర్వహించి వనరులు, వివిధ రకాల పంటలు, సంపద గురించి రైతులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం రైతులతో కలిసి పంట పొలాలను సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాలలోని అసిస్టెంట్ ప్రొఫెసర్లు హరికృష్ణ, సీహెచ్.యశస్విని, ఎం.హారిక, కె.మానస, కె.గోపిక, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ దిలీప్, వీరన్న పాల్గొన్నారు.

మార్కెట్‌లో ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వరంగల్: ఏనుమాముల వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని ప్రాథమిక చికిత్స ఆరోగ్య కేంద్రంలో అపోలో రీచ్ ఎన్‌ఎస్‌ఆర్ హాస్పిటల్స్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కరం చంద్‌తో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి ప్రారంభించారు. వైద్య శిబిరంలో 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి రాహుల్, డైరెక్టర్లు కంది రవీందర్ రెడ్డి, పిన్నింటి వెంకటరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, సంయుక్త కార్యదర్శి చాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, సభ్యులు కైలాస హరినాథ్, సూదాటి రాజేశ్వరరావు, గాజుల సుమన్, కంచ సంపత్, అడ్తి సెక్షన్ ఎస్‌రెడ్డి.లింగారెడ్డి, చిత్తారి సంజీవ్‌కుమార్, దొంతుల శోభన్, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, చిల్లీస్ సెక్షన్ అధ్యక్షుడు రాజేష్ డి.కరాని, వద్దే వెంకటేశ్వర్లు, డాక్టర్లు అగస్త్య మ్యాక్స్, దిలీప్, రాజిరెడ్డి, విజయకుమార్, నిహారిక పాల్గొన్నారు.

బాధితులకు అండగా 'సఖి'



మాట్లాడుతున్న లీగల్ కౌన్సెలర్లు

కాజీపేట అర్బన్: ఆపదలో ఉన్న మహిళలు సఖి కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సెలర్లు శ్రీదేవి, వినీల సూచించారు. కాజీపేట మండలం అయోధ్యపురంలో సఖి సెంటర్ సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరకట్న, లైంగిక వేధింపులు, భ్రూణహత్యల ఒత్తిడితో బాధపడుతున్న మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు వైద్య, న్యాయ, పోలీస్ సలహాలతో పాటు తాత్కాలిక వసతి కల్పిస్తామని వివరించారు. బాధితులు 181 లేదా 0870 – 2452112 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

6న హనుమాన్ బైక్ ర్యాలీ

నయీంనగర్: భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీని ఏప్రిల్ 6న మధ్యాహ్నం రంగశాయిపేట మహంకాళి దేవాలయం వద్ద ప్రారంభం కానుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాలకొండ భాస్కరరావు తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బైక్‌ర్యాలీ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ పద్మాక్షి గుడి హనుమద్గిరి వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందని వివరించారు. ర్యాలీకి ముందు 10వేల మందితో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని భాస్కరరావు పేర్కొన్నారు.

అనాథ పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

మామునూరు: తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. అనాథ బాలల సానుభూతి దినోత్సవ కార్యక్రమంలో భాగంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై రామక్రిష్టాపురం సమీపంలోని ఓ ఫంక్షన్‌లో వర్డ్ స్వచ్ఛంద సంస్థ, మరియపురం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం వర్డ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా 150 మంది అనాథ పిల్లలకు జన్మదిన వేడుకలు నిర్వహించారు. సమావేశంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్, వర్డ్ డైరెక్టర్ జార్జిమెర్సీ, తదితరులు పాల్గొన్నారు.

'పెరిక కార్పొరేషన్' ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఖిలా వరంగల్: పెరిక కులస్తులకు ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వరంగల్ జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ తూర్పుకోటలో పెరిక కుల సంఘం, కాకతీయ పెరిక పరపతి సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమ నేత, తొలి అమరుడు సుంచు చంద్రమౌళి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పెరిక కులానికి విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాల్లో దక్కాల్సిన వాటా దక్కట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిక కులస్తుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, సుంచు వీరన్న, బెడిదే వీరన్న, బొలుగొడ్డు శ్రీనివాస్, వనపర్తి ధర్మరాజు, కందిమల్ల మహేష్, అర్షం రాంబాబు, ఏసీరెడ్డి ప్రభాకర్, బొలుగొడ్డు శ్రీనివాస్, రఘు, అమృత్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



ప్రశంస పత్రాలు అందజేస్తున్న కలెక్టర్

కేయూ క్యాంపస్: రక్తదానం మరొకరికి ప్రాణదానం అని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ గురువారం ఏర్పాటు చేసింది. ముఖ్యఅతిథిగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొని రక్తదానం చేసిన వారికి ప్రశంసపత్రాలు అందించి మాట్లాడారు. రక్తదానంపై ఉన్న అపోహలు నివృత్తి చేసుకుని రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంతి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు ఉప్పుల కొమురయ్య, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సంతోష్, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలు



సహృదయలో అన్నదానం చేస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, యువజన, టూరిజం శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను టీజీవోస్ నాయకులు గురువారం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీవోస్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక వికలాంగులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం, చేసి, ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీజీఓ జనగామ జిల్లా అధ్యక్షుడు అంజద్ అలీ, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వరంగల్ కార్యదర్శి ఫణికుమార్, రాష్ట్ర కార్యదర్శులు కిరణ్‌కుమార్, రాజేష్‌కుమార్, కోశాధికారి ఈగ వెంకటేశ్వర్లు, నాగ నారాయణ, సబ్ రిజిస్ట్రార్ సంపత్‌కుమార్, సంజీవరెడ్డి, జీవరత్నం, వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, మాధవరెడ్డి పాల్గొన్నారు.

సహృదయ ఆశ్రమంలో..

కాజీపేట: ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ పుట్టినరోజు వేడుకలను టీజీఓస్ నాయకులు గురువారం రాత్రి నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అసోసియేషన్ కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో సభ్యులు.. వృద్ధులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అవజద్ అలీ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్, కిరణ్ కుమార్, రాజేష్ కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, నాగ నారాయణ పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ అధికారిపై చర్య తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ రూరల్: బీసీ వెల్ఫేర్ వరంగల్ జిల్లా అధికారి శంకర్‌నాయక్‌పై చర్య తీసుకోవాలని టీఎన్‌జీఓస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి గాజే వేణుగోపాల్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంకిషన్ మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న హాస్టల్ అధికారులు, సిబ్బందిని శంకర్‌నాయక్ మానసికంగా వేధిస్తున్నారని పేర్కొన్నారు. వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని, హాస్టళ్లకు కేటాయించిన బడ్జెట్‌ను సకాలంలో పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. హాస్టల్ అద్దె భవనాలకు సకాలంలో అద్దెలు చెల్లించకుండా అలసత్వం వహిస్తూ, యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫోరం అధ్యక్షుడు వీరన్న, కార్యదర్శి రవికుమార్, జోసెఫ్, రవీందర్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పరీక్ష పత్రం లీకేజీపై విచారణ జరపాలి

వరంగల్ రూరల్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు హకీమ్ నవీద్ అదనపు కలెక్టర్ శ్రీవత్సను కలెక్టరేట్‌లో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రవీణ్‌కుమార్‌తోపాటు టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీ హస్తం కూడా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం గ్రేటర్ నాయకులు రోహిత్, సహబాజ్, శ్రీనివాస్, జుబేర్, సందీప్ పాల్గొన్నారు.

జూడో విజేతలకు కలెక్టర్ అభినందన

కాశిబుగ్గ: పారా జూడో జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన ఐదుగురు క్రీడాకారులను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య బుధవారం అభినందించారు. ఉత్తరప్రదేశ్ లక్నోలో ఇటీవల జరిగిన 11వ పారా జూడో జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో వరంగల్ జిల్లాకు చెందిన కె.విఘ్నేష్, బి.హరిహరన్, వి.జీవన్, బి.గౌతమ్, బి.హర్షిత్ ఉత్తమ ప్రదర్శన కనబర్చి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. కాగా, వారిని కలెక్టర్ అభినందించి భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఇందిర, కోచ్‌లు సత్యవాణి, సుమన్, లింగమూర్తి, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వరంగల్: తెలంగాణలో తెలుగుదేశం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ గ్రామగ్రామాన తెలుగుదేశం నినాదం మార్మోగేలా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేసి, టీడీపీకి పూర్వ వైభవం వచ్చేలా ప్రతీకార్యకర్త కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య పిలుపునిచ్చారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వరంగల్ పార్లమెంట్ స్థాయి టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ అసెంబ్లీ కోఆర్డినేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో వార్డు, గ్రామ, మండల, డివిజన్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిల్లో పార్టీ సభ్యత్వాల నమోదును చేపట్టాలని సూచించారు. పార్టీ కమిటీలను పునర్నిర్మాణం చేసి పార్టీని బలోపేతం చేసేందుకు చొరవ తీసుకోవాలని అన్నారు. సమావేశంలో నాయకులు గట్టు ప్రసాద్ బాబు, గన్నోజు శ్రీనివాసాచారి, బాబా ఖాదర్‌అలీ, ఎండీ.రహీమ్, చాడ మరియ, హన్మకొండ సాంబయ్య, విద్యాసాగర్, రవీందర్, శ్రీధర్, నాగవెల్లి సురేష్, ముంజ వెంకట్రాజం పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

హసన్‌పర్తి: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని బ్యాంక్ సిబ్బందికి ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు పిలుపునిచ్చారు. నగరంలోని భీమారంలో హెచ్‌డీఎఫ్‌సీ నూతన శాఖను ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ సర్కిల్ హెడ్ హెచ్.పవన్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ క్లస్టర్ హెడ్ మారుతిరావు, బ్రాంచీ మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి బీజేపీ నేతల పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యాల రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకుమార్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డిలు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేందర్‌కు రూ.5వేల ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అభినందనలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగేలా శ్రమించిన ఆలయ కార్యకర్తలను గురువారం రాత్రి ఆలయ వ్యవస్థాపకులు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి అభినందించారు. రెండు రోజులుగా శ్రమించి 29 దేవతామూర్తులకు సేవలు చేసి, సంతనాలింగేశ్వర స్వామి దర్శించుకోవడావడానికి విచ్చేసిన భక్తులకు ఇబ్బంది కలగకుండా సహాయ, సహకారాలను అందించిన వారందరికి స్వామి వారి శేష వస్త్రాలను అందించి ఆశీర్వచనం చేశారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

కాజీపేట: చందా ఇవ్వలేదనే ఆగ్రహంతో పాఠశాల ఎలా నడుస్తుందో చూస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ దర్గా కాజీపేట శివారులో అలీవ్ హైస్కూల్‌లో కరస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మదాల సతీష్ వద్దకు బిరుదురాజు శ్రీధర్ రాజు అనే వ్యక్తి వచ్చి చందా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10 వేలు ఇచ్చుకోలేనని కరస్పాండెంట్ చెప్పగా 'నీ లోసుగులు అన్ని నాకు తెలుసు' అని బెదిరింపులకు పాల్పడిన రాజుపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ పడమర కోటలోని నిర్మానుష్య ప్రదేశంలో రహస్యంగా గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన బేతి రాజశేఖర్, పశ్చిమ కోటకు చెందిన బొల్లం రాజు కుమార్, పుప్పాల సాయికిరణ్, లక్క సాగర్, సంగరబోయిన మహేందర్, బొల్లం నాగరాజు కలిసి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,770 నగదు, 3 మొబైల్‌ఫోన్లు, ప్లేయింగ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

వరంగల్‌నుంచి ఉదయం పుష్‌పుల్ నడపాలి

- కాజీపేట నుంచి నడుపుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



కాశిబుగ్గ: వరంగల్, వరంగల్ పరిసర ప్రాంత ప్రజలు ఉదయం వేళలో హైదరాబాద్ వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి గతంలో మాదిరిగా పుష్‌పుల్ రైలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోవిడ్‌కు ముందు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 5గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్ వెళ్లేందుకు పుష్‌పుల్ ప్యాసింజర్ రైలు అందుబాటులో ఉండేది. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్‌తో రైల్వే శాఖ పలు రైళ్లను రద్దుచేసింది. కోవిడ్ అనంతరం తిరిగి రైళ్లను పునరుద్ధరించిన కొంతకాలం వరకు పుష్‌పుల్ రైళ్ల ప్రారంభం కాలేదు. దీంతో పెద్దఎత్తున ప్రజల నుంచి వినతులు, పత్రికల్లో కథనాలు రావడంతో రైల్వేశాఖ స్పందించి పుష్‌పుల్ రైళ్లను తిరిగి ప్రారంభించింది. అయితే ఉదయం హైదరాబాద్ వెళ్లే పుష్‌పుల్ ప్యాసింజర్‌ను వరంగల్ నుంచి కాకుండా కాజీపేట నుంచి ప్రారంభించింది. దీంతో వరంగల్, వరంగల్ పరిసర ప్రాంత ప్రజలు ఉదయం సమయంలో హైదరాబాద్ వెళ్లాలంటే కాజీపేటకు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఈక్రమంలో ప్రయాణికులు తీవ్ర వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇద్దరు ఎంపీలు పసునూరి దయాకర్, మాలోతు కవిత, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలతో పాటు జెడ్‌ఆర్ యూసీసీ సభ్యులు ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వేళలో పుష్‌పుల్ రైలు వరంగల్ నుంచి ప్రారంభించాలని కోరుతున్నా స్పందన లేదని వాపోతున్నారు. గతంలో మాదిరిగా ఉదయం సమయంలో కూడా పుష్‌పుల్ రైలు వరంగల్ నుంచి నడిపే విధంగా కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.